క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



ఆరోగ్యశ్రీ కార్డులకు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

నరసన్నపేట: ఒక కుటుంబానికి రూ.25 లక్షల వరకూ ఇకనుంచి ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం అందనుందని యారబాడు సర్పంచ్ యాబాజి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు సురవరం పాపినాయుడు అన్నారు. యారబాడు పంచాయతీకి వచ్చిన 180 ఆరోగ్యశ్రీ కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గతంలో రూ.రెండు లక్షల వరకు వైద్య సేవలు అందేవని, దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.పది లక్షలకు పెంచారని, ఇప్పుడు మళ్లీ రూ.25 లక్షలకు పెంచారన్నారు. పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామ వలంటర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో రొట్టవలసకు ప్రథమ స్థానం



వాలీబాల్ విజేతలకు షీల్డ్ అందజేస్తున్న హెచ్ఎం రామకృష్ణారావు

సరుబుజ్జిలి: ఆడుదాం– ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా రొట్టవలస హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు విజేతలైన క్రీడాకారులకు హైస్కూల్ హెచ్ఎం కె.రామకృష్ణారావు గురువారం షీల్డ్‌లు అందించి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడారంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్ సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు అప్పయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: స్థానిక వీరన్నాయుడు కాలనీకి చెందిన కత్తుల చక్రధర్ ఇటీవల మృతి చెందారు. మృతుని భార్య రాజులకు గురువారం బీమా చెక్కు రూ.90 వేలను సర్పంచ్ బూరల్లి శంకర్ అందజేశారు. నెల రోజుల్లోనే బీమా డబ్బులు బాధిత కుటుంబాలకు అందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు నాగవంశం శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతింటి సింహాచలం తదితరులు ఉన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



ఝాన్సీకి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన బొబ్బాది కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతి భార్య ఝాన్సీకి ఆమె స్నేహితులు రూ.10 వేలను గురువారం పారాపురంలో అందజేశారు. ఝాన్సీ భర్త మృతి చెందిన విషయాన్ని ఆమెతోపాటు పదో తరగతి చదువుకున్న స్నేహితులకు తెలిసింది. చిన్న వయస్సులో భర్తను కోల్పోయిన ఝాన్సీకి తమవంతుగా ఆర్థికసాయం అందజేసినట్లు శివ, యశ్వంత్, చంద్రశేఖర్ తదితరులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ



కుమ్మరిగుంటలో మద్దిలి చిన్నమ్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివశంకర్

సారవకోట: మండలంలో అన్ని గ్రామాలలో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారు జాము నుంచి గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తం అందజేశారు.

నేడు కొమనాపల్లిలో ఆసరా సంబరాలు

జలుమూరు: కొమనాపల్లి జంక్షన్‌లో శుక్రవారం మధ్యాహ్నం నాలుగో విడతలో ఆసరా సంబరాలు జరగనున్నాయని ఎంపీపీ వాన గోపి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల మహిళలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ రాజ్యంతో ప్రజల్లో ఆనందం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు: ఇంటింటికీ సంక్షేమ ఫలాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోలాపి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ చేరువ చేశారన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్నారన్నారు. మరలా సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బి.సునీల్, పప్పల రాధాకృష్ణ, దుంపల శ్యామలరావు, పప్పల అన్నాజీరావు, పప్పల రమణమూర్తి, పప్పల రామ్మోహనరావు, బోనిగి సింహాచలం, దుంపల లక్ష్మణరావు, దుంపల సీతారాం, పొన్నడ గణపతిరావు, గురుగుబెల్లి యువరాజు, పొత్నుని చిన్నబాబు, గురుగెబల్లి నారాయణరావు, పప్పల తవిటినాయుడు, పప్పల జగన్నాథరావు, దుంపల నాగరాజు, పప్పల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సమితి జిల్లా కార్యదర్శి లింగరాజు

నరసన్నపేట: యువతులు, మహిళలు ఇతరులపై ఆధారపడకుండా వారి స్వశక్తితో అభివృద్ధి చెందడానికి వీలుగా సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట ప్రత్యేక ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని సత్యసాయి సేవా సంస్థలు జిల్లా కార్యదర్శి వై లింగరాజు అన్నారు. నరసన్నపేట చిత్తిరివీధిలో సత్యసాయి పెద్దమందిరంలో ఏర్పాటు చేసిన మగ్గం స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో టైలరింగ్, కంప్యూటర్, ఫ్రిజ్, టీవీ మెకానిక్ వంటి వాటిపై పలువురికి శిక్షణ ఇచ్చామన్నారు. నరసన్నపేటలో మగ్గం వర్క్‌పై శిక్షణ కోసం 156 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో యువతులకు మొదటి ప్రాధాన్యతగా 72 మందిని ఎంపిక చేసి, రెండు షిఫ్టుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్‌లో మెలకవలు కూడా తెలియజేస్తామన్నారు. 60 రోజులు ఈ శిక్షణ ఉంటుందన్నారు. సత్యసాయి స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, సేవా సమితి జోనల్ ఇన్‌చార్జి నారాయణమూర్తి, పెద్ద మందిరం ఇన్‌చార్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయంలోనే..

శ్రీముఖలింగం అభివృద్ధి



మాట్లాడుతున్న దామ మన్మధరావు

జలుమూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే శ్రీముఖలింగం ఎంతో అభివృద్ధి చెందిందని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి పార్టీలు చూడకుండా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దామ మన్మథరావు అన్నారు. పాగోడులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన శ్రీముఖలింగం సర్పంచ్ సతీష్ ఉనికిని చాటుకోవడానికి, టీడీపీ నాయకుల మెప్పు కోసం సీఎం జగన్‌ను విమర్శించడం తగదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన సతీష్ అభివృద్ధి కోసం మాట్లాడం సరికాదన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే సహకారంతో శ్రీముఖలింగం పంచాయతీకి నాడు-నేడు నిధుల ద్వారా పాఠశాలల అభివృద్ధి, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రోడ్లు తదితర నిర్మాణాలు చేపట్టామన్నారు. మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు జెడ్పీ నిధులు సుమారు రూ.10 లక్షలు ఇచ్చింది నిజం కాదా అని సతీష్‌ను ప్రశ్నించారు. నీవు చెప్పే అబద్ధాలు, కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. చెన్నయవలస సర్పంచ్ బొమ్మాళి ప్రసాద్ ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని డిమాండ్



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న సహారా ఏజెంట్లు, పాలసీదారులు



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న పాలసీదారులు, ఏజెంట్లు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో సహారా ఏజెంట్లు గురువారం ర్యాలీ చేపట్టారు. ఏజెంట్లకు, ఖాతాదారులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సహారా ఇండియా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయం నుంచి పాతబస్టాండ్, బజారు, పంచాయతీ కార్యాలయం, జూనియర్ కాలేజీ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. ఖాతాదారులకు కోట్ల రూపాయల్లో బకాయిలు ఉన్నాయని ఏజెంట్ల ప్రతినిధి పెంటబాబు అన్నారు. యాజమాన్యం స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆస్పత్రి కూడలి సమీపంలో ఉన్న సహారా ఇండియా పాలసీదారులు, ఏజెంట్లకు పెమెంట్‌లు చెల్లించాలని ఖాతాదారులు బి.సత్యానారాయణ, పి.వెంకటరావు, కె.శ్రీలక్ష్మి, జి.భాస్కరరావు అన్నారు. సహారా కార్యాలయం వద్దకు ఏజెంట్లు, పాలసీదారులు పాతపట్నం ప్రధాన రహదారి మీదుగా గురువారం ర్యాలీ నిర్వహించారు. 12 ఏళ్లుగా పాలసీదారులకు చెల్లింపులు జరగడం లేదని, ఆన్‌లైన్ చేకరించిన వాటికి తక్షణమే చెల్లించాలన్నారు. తహసీల్దార్ ఎస్ఐ మహమ్మద్ యాసీన్‌కు వినతిపత్రం అందజేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: ఎన్నికలు సమీపిస్తున్నందున స్థానిక పోలీస్‌లు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని గూనభద్ర రిజర్వాయర్ బ్రిడ్జి ఏబీ రోడ్డులో స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రోడ్డు నిబంధనలు పాటించని 20 మంది వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. మండలానికి అనుకుని ఉన్న ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు డిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు స్పీకర్ పర్యటన

బూర్జ: మండలంలోని కొరగాం పంచాయతీ పరిధి బోరగవలస, తమ్మినాయుడుపేట పంచాయతీ పరిధి కటకమయ్యపేట, తమ్మినాయుడుపేట గ్రామాల్లో శుక్రవారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచి నీటి కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల

హిరమండలం: గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఈఓపీఆర్డీ పి.నాగమణి గురువారం తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు రూ.75,51,872 నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తం ఇప్పటికే పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఈ నిధుల్లో కొంత గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు చెల్లించాలని, మిగిలిన వాటితో సర్పంచ్‌లు పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్యంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలన్నారు.

ఎంపీడీఓల నియామకం

అరసవల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు మండలాలకు కొత్త ఎంపీడీఓలు నియాకమయ్యారు. స్థానిక ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. కొత్త ఎంపీడీఓలు గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంపీడీఓ	మండలం
కె.వెంకన్నబాబు	పాతపట్నం
ఎం.రత్నం	సరుబుజ్జిలి
డి.డి.స్వరూపారాణి	హిరమండలం
సిహెచ్.సూర్యనారాయణ	పొందూరు
పి.త్రివిక్రమ్‌రావు	కొత్తూరు
జి.గిరిబాల	ఎల్ఎన్.పేట

బాధ్యతల స్వీకరణ



సరుబుజ్జిలి: ఎంపీడీఓకు అభినందలు తెలుపుతున్న సిబ్బంది

సరుబుజ్జిలి: ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా నుంచి ఎంపీడీఓగా వచ్చిన ఎం.రత్నం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా ఉన్న వీవీ మురళీమోహన్‌కుమార్ అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.



ఎంపీడీఓ త్రివిక్రమరావు


కొత్తూరు: స్థానిక ఎంపీడీఓగా పి.త్రివిక్రమరావును ప్రభుత్వం నియమించిది. ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగం జిల్లా మెంటాడ మండలం నుంచి బదిలీ వచ్చి గురువారం విధుల్లో చేరారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎం.పావని విజయనగరం జిల్లా మెరకముడిదాం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

కొత్త తహసీల్దార్ల రాక..

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తహసీల్దార్లకు బదిలీలు జరిగాయి. విశాఖ జిల్లా నుంచి కొత్తగా జిల్లాకు తహసీల్దార్లు రాగా.. వీరికి కలెక్టర్ పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు తక్షణం విధుల్లోకి చేరాలని ఆదేశాలు ఇచ్చారు.

తహసీల్దార్	పోస్టింగ్ స్థానం
కె.వేణుగోపాల్ (విశాఖపట్నం)	ఆమదాలవలస
ఎం.పాల్ కిరణ్ (విశాఖపట్నం)	పొందూరు
వై.శ్యామ్‌కుమార్ (విశాఖపట్నం)	సరుబుజ్జిలి
ఎస్.వి.అంబేడ్కర్ (విశాఖపట్నం)	బూర్జ
వై.ఎస్.వి.వి.ప్రసాద్ (విశాఖపట్నం)	పాతపట్నం
బి.నాగజ్యోతి (విశాఖపట్నం)	హిరమండలం
ఎం.వి.వి.ప్రసాద్ (విశాఖపట్నం)	కొత్తూరు
ఎస్.రాణీ అమ్మాజీ (విశాఖపట్నం)	ఎల్ఎన్ పేట
కె.జానకమ్మ (విశాఖపట్నం)	మెళియాపుట్టి
ఎల్.రామారావు (విశాఖపట్నం)	నరసన్నపేట
ఎస్.ఎల్.వి.ప్రసాద్ (విశాఖపట్నం)	పోలాకి
సి.హెచ్.నాగమణి (విశాఖపట్నం)	జలుమూరు
పి.భాగ్యవతి (విశాఖపట్నం)	సారవకోట

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక



ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో **గేదెల అఖిల** 8వ తరగతి చదువుతున్న గేదెల అఖిల ఎన్ఎంఎంఎస్ ఎంపికైనట్లు తండ్రి గేదెల హరికృష్ణ (సైకత శిల్పి) గురువారం తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

చిన్నదూగాం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

జలుమూరు: గ్రామ కంఠం ఆక్రమణలు, పంచాయతీ నిధుల దుర్వినియోగం చేసిన చిన్నదూగాం సర్పంచ్ పీస పద్మావతిని ఆ పదవి నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చినట్లు సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ పబ్లిక్ కుళాయిలను సొంతానికి వాడుకోవడం, అనర్హులకు పింఛన్లు మంజూరు చేయడం, కాకర్ల చెరువును బంధువుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయడం, లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చిన రూ.ఐదు లక్షలు సొంత అవసరాలకు వినియోగించడంపై అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రావాడ హిమవంత్ గతంలో ఫిర్యాదు చేశారన్నారు. వీటిపై జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీఓలు విచారించి నిజమేనని నిర్ధారించారన్నారు. దీనిపై 2022లో కలెక్టర్‌కు నివేదిస్తే ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆక్రమాలకు పాల్పడిన సర్పంచ్‌పై వెంటనే చర్యలు చేపట్టకపోతే..హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



సేవ్ గర్ల్ చైల్డ్ (ఎస్‌జీసీ)



ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, ఆరోగ్య సిబ్బంది

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామంలోని కేజీబీవీలో లింగనిర్ధారణ(పీసీపీఎన్‌డీటీ) యాక్ట్‌పై తాడివలస పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది బాలికలకు అవగాహన కల్పించారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని గురువారం ర్యాలీ చేపట్టారు. సేవ్ గర్ల్ అనే నినాదాలను చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్, డాక్టర్, లాయర్, భరతమాత వంటి వేషధారణలు ఆకట్టుకున్నాయి. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు జి.రమేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలే రానున్న ఎన్నికల్లో విజయానికి సోపానాలు అవుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నవరత్న పథకాలతోపాటు పలు సంక్షేమ పథకాలు సీఎం జగన్ అమలు చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ పెన్షన్ కానుక మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంతో లక్షలాది మంది జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాయాల ద్వారా అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ పాతపట్నం నియోజకవర్గంపై చూపించిన అభిమానంతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియోజవర్గంలో ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.పది కోట్లతో అదనపు భవనాల నిర్మాణం, మెట్టూరులో ప్రభుత్వ ఆస్పత్రి మంజూరు, కొత్తూరులో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు, గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం అదనపు పరిహారాలను సీఎం జగన్ అందజేశారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాతపట్నం నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. పార్టీ నేతలు బోర లక్ష్మణరావు, గొంటి రమేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం



దత్తత తీసుకున్న విద్యార్థులతో ట్రస్టు సీఈఓ, ఎస్‌వీసీటీ ప్రతినిధులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ తల్లి, తండ్రి లేని పేద విద్యార్థులను దత్తత తీసుకుని, వారి విద్యకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని పడాల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, సీఈఓ పడాల సూర్యప్రసాద్ గురువారం తెలిపారు. కాకినాడ ప్రాంతంలో పదుల సంఖ్యలో విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేటలో స్వామిబాబు–వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు (ఎస్‌వీసీటీ) వారి సహకారంతో మా సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత (బోర్డు) పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 16 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారధి ప్రాజెక్టులో భాగంగా దత్తత తీసుకున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించనున్నామన్నారు. 7వ తరగతి నుంచి విద్యార్థులను ఎంపిక చేసి వారికి విద్యాపరంగా, వ్యక్తిగతంగా, వైద్యపరంగా అన్ని సౌకర్యాలూ చదువు పూర్తి అయ్యేంత వరకు అందిస్తామన్నారు. స్వేచ్ఛ ప్రాజెక్టులో భాగంగా 14 పాఠశాలలను మూడు విడతులగా సందర్శించి 1,400 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరిశుభ్రత, కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌వీసీటీ పీఆర్వో సదాశివుని కృష్ణ, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.రమేష్, సిబ్బంది రామారావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- జల్ జీవన్ మిషన్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



దిబ్బలపేటలో తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో నారిపేట, దిబ్బలపేట, కంచరాపువానిపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓపీఆర్డీ గోవిందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లలితకుమారి, జేఈ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శులు సీపాన హరీష్, బగాది నాగరాజు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు తప్పనిసరిగా హాజరవ్వాలి

కొత్తూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి సంబంధించిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ నెల 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షకు హాజరుకాని విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఫలితాలు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి ఈ రెండు పరీక్షలకు హాజరుకావాలన్నారు.